



ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి విడుదల చేసిన వరద నీటి ప్రవాహం

తగ్గుతూ.. పెరుగుతూ..

- ఎగువున పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం
- ఎగువన ప్రాణహిత, ఇంద్రావతి నుంచి వస్తున్న వరదనీరు
- ధవళేశ్వరం వద్ద 10 లక్షల క్యూసెక్కుల వరకు రావచ్చని అంచనా

6

వరద సహాయక చర్యలకు ఒక్కో జిల్లాకు రూ.కోటి



నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

వర్చువల్‌గా సీఎం.. మంత్రులు నిమ్మల, కందుల హాజరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు సమీపంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌ఐటీహెచ్)ని బుధవారం సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ ప్రత్యక్షంగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖాముఖి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఇక్కడ 147 పరిశ్రమల ప్రతినిధులు, 85 స్టార్టప్‌ల ఔత్సాహికులు, 950 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ యాక్సిలరేషన్, పెట్టుబడి, ఫైనాన్సింగ్ వంటి అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభను ప్రదర్శించుకొనే హబ్‌గా ఆర్టీఐహెచ్ ఉపయోగపడనుందని చెప్పారు. ఆర్టీఐహెచ్ నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలోని ఏర్పాట్లపై సమీక్ష చేసి సమన్వయ శాఖలతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి పాల్గొన్నారు.

చేతికి 'స్మార్ట్'గా..





ఈనెల 25 నుంచి ఉమ్మడి జిల్లాలో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. పాత, కొత్త లబ్ధిదారు లందరికీ కలిపి ఒకేసారి వీటిని నియోజకవర్గాలు, మండలాల్లో అందించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ఫొటోతో చాంతాడంత రేషన్‌కార్డు జారీ చేసి వైసీపీ సొంత ప్రచారం చేసుకుంది. దీని స్థానంలో ఇప్పుడు కొత్తగా ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డు ఇవ్వబోతోంది. అచ్చం ఏటీఎం కార్డు తరహాలో ఉండే కార్డులపై కేవలం లబ్ధిదారుడి పేరు, ఫొటో మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. అలాగే కొత్త కార్డుదారులకు సైతం ఈనెల నుంచే రేషన్ పంపిణీ చేయనున్నారు.

- కొత్త స్మార్ట్ రేషన్ కార్డులొచ్చేస్తున్నాయ్
- ఈనెల 25 నుంచి మండలాల వారీగా పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 17.41 లక్షల పాతకార్డుల స్థానంలో కొత్తవి అందజేత
- ఇటీవల దరఖాస్తు చేసుకున్న వారిలో 34 వేల మంది కొత్త లబ్ధిదారులకూ
- కార్డులపై లబ్ధిదారుడి ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు.. కొత్తవారికీ రేషన్
- ఏటీఎం కార్డు తరహాలో ఉండే రైస్‌కార్డులపై క్యూఆర్ కోడ్‌లు కూడా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో చివరకు రేషన్‌కార్డులను సైతం భారీగా ఏరేశారు. పలు పథకాలకు రేషన్‌కార్డు అర్హత కావడంతో పెరిగిన ఆర్థిక భారాన్ని తప్పించుకోవడానికి కార్డులను గుట్టుచప్పుడు కాకుండా అప్పటి ప్రభుత్వం ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 15.69లక్షల తెల్లకార్డులుండగా, వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లాల పౌరసరఫరాలశాఖలకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి కార్డులు రద్దుచేసింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటినీ రద్దు చేసేశారు. కొత్తగా వివాహం అయిన దంపతులు, కార్డు ఉండి కొత్తగా పిల్లలున్న వారు ఇలా అనేక విభాగాల్లో కార్డులు జారీ చేయడం, మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నవి వేలల్లో ఉన్నా అదేం పట్టించుకోలేదు. చిరుద్యోగాలు చేసుకునేవారు తమ తల్లిదండ్రుల కార్డుల్లోంచి తమపేర్లు తొలగించాలని కోరినా ఏవేవో కారణాలు చూపి పథకాలను నిలిపివేసింది. దీంతో జనం రేషన్ కార్డుల విషయంలో పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అనేకసార్లు ప్రజలు అప్పట్లో గ్రీవెన్స్‌సెల్‌లో కూడా భారీగా కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయాలంటూ వినతులు అందించినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. మరోపక్క అప్పట్లో ఉన్న రేషన్‌కార్డులను రద్దుచేసి ఏకంగా అప్పటి సీఎం జగన్ ఫొటోతో కార్డులు జారీచేసింది. ప్రతి కార్డుదారుడికి జగన్ ఫొటోతో కాగితం ముక్క చేతిలో పెట్టింది. తద్వారా రాజకీయంగా ఈ కార్డుల ద్వారా లబ్ధిపొందేందుకు ప్రయత్నించింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. అదే సమయంలో రేషన్‌కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర అధికారులు కలిపి ప్రభుత్వ ఆమోదంతో స్మార్ట్‌కార్డుల జారీకి నిర్ణయించారు. ఈ కొత్తకార్డులపై గత ప్రభుత్వం తరహాలో సీఎం బొమ్మ లేకుండా కేవలం కార్డుదారుడి ఫొటోలే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్డులపై కార్డుదారుడి పేరు, చిరునామా, మిగిలిన సభ్యుల పేర్లు ఉండేలా వీటిని తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటి ముద్రణ దాదాపు పూర్తయింది. వీటిని ఈనెల 23లోగా జిల్లాలకు ప్రభుత్వం పంపనుంది. వీటిని ఈనెల 25 నుంచి జిల్లాస్థాయిలో మంత్రి, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అటు మండలాల్లోను సమాంతరంగా కొత్తస్మార్ట్‌కార్డులను లబ్ధిదారులకు అందించనున్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో 6,41,533, తూర్పుగోదావరి జిల్లాలో 5,63,089, కోనసీమ జిల్లాలో 5,36,575 కార్డుదారులున్నారు. వీరందరికి కొత్తస్మార్ట్ కార్డులు అందజేయనున్నారు.

మరో 34 వేల మందికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మొత్తుకున్నా పేదలకు కొత్త రేషన్‌కార్డుల జారీ పెద్దగా ఇవ్వలేదు. మార్పులు, చేర్పులను సైతం పట్టించుకోలేదు. దీంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తకార్డులకు ప్రభుత్వం మే 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. కొత్తగా వివాహం అయినవారు, ఇప్పటివరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు.. ఇలా ఏడు రకాల సేవల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ వేలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. వీటన్నింటిని సచివాలయాల స్థాయిలో వీఆర్వో నుంచి తహశీల్దార్ల వరకు ఆ అర్జీలను పరిశీలించి మార్పులు చేర్పుల ప్రక్రియ పూర్తి చేశారు. అందులోభాగంగా కాకినాడ జిల్లాకు కొత్తగా 13 వేలు, కోనసీమ 11 వేలు, తూర్పుగోదావరి 10 వేల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరుచేసింది. వీరికి కూడా ఈనెల 25 నుంచే స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. అటు రేషన్ కూడా ఈ నెల్లోనే కొత్తకార్డుదారులు పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్క కొత్త రేషన్‌కార్డులను రైస్‌కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూ ఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలు ఎలా ఉన్నాయి? డబ్బులు అడుగుతున్నారా? వంటి ఫిర్యాదులను సైతం క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తెలపవచ్చు. ఎలాంటి ప్రచార్భాటం లేకుండా ప్రభుత్వ చిహ్నంతో కార్డుల అందజేతపై హర్షం వ్యక్తమవుతోంది.



కాకినాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు

- హాజరైన జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్లు
- కౌడా ఆధ్వర్యంలో నిర్వహణ

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు, లైసెన్సు సర్వేయర్లకు కాపు కల్యాణ మండపంలో మంగళవారం ఎల్ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, విశాఖ, కాకినాడ పెట్రో కెమికల్ ఫార్మా ఇండస్ట్రియల్ కారిడాల్ ప్లానింగ్ ఆఫీసర్ రోహిణి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, కాకినాడ నగరపాలకసంస్థ డీసీపీ కృష్ణారావు, కౌడా సెక్రటరీ కాళీబాబు హాజరై అవగాహన సదస్సులో ఎల్ఆర్ఎస్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌడా వైస్ చైర్మన్, జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ను పొడిగిస్తూ సవరణ ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో లేఅవుట్లను కార్యదర్శులు గుర్తించి నివేదిక తయారు చేయాలని సూచించారు. గతంలో 2020, డిసెంబరు 31 నాటికి దరఖాస్తు చేసుకోలేని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కలిగించడానికి 2025 జూన్ 30న ముందువేసిన అనధికార లేఅవుట్లలోని రిజిస్టర్ అయిన అనధికార ప్లాట్లను ప్రణాళికాబద్ధంగా తీసుకురావడానికి మరో అకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం మున్సిపల్ స్థానిక సంస్థలు, అర్బన్ డెవపల్‌మెంట్ అథారిటీలు, ఏపీసీఆర్‌డీఏలోని అన్నిప్రాంతాలు, యూడీఏఎస్ వెలుపల మాస్టర్ ప్లాన్లు, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లు పరిధిలోని గ్రామ పంచాయతీలు, ఐఏఎల్‌ఏలు పరిధిలో ప్రాంతాలకు వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో ఆమోదించిన లైసెన్సు టెక్నికల్ ఏర్సన్స్ ద్వారాకానీ, స్వయంగా కానీ అనధికార లేఅవుట్‌లో ఉన్న మీ స్థలాలు ప్లాన్‌లు తయారుచేసుకుని అపరాధ రుసుములో 50శాతం లేదా రూ.10వేలకు తగ్గకుండా చెల్లించి నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 50 రోజులలోపు సంబంధిత యాజమాన్యపు హక్కు పత్రాలు, స్థానాలతో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డీసీపీ కృష్ణారావు మాట్లాడుతూ అనధికార లేఅవుట్లలో జూన్ 30లోపు ప్లాట్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్నవారు లింక్ డాక్యుమెంటు ప్లాటుగా ఉన్నా కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. అనధికారికంగా విభజించిన లేఅవుట్లలో కనీసం ఒక్క ప్లాటైన జూన్ 30లోపు విక్రయం జరిగి ఉండాలని, ప్లాట్ అనధికార లేఅవుట్లలో అనధికారంగా విభజించిన స్థలంలో భాగంగా ఉన్న స్థల యజమానులు అవసరమైన డాక్యుమెంట్లు రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు/యాజమాన్య పత్రం, అనుబంధ లింక్ డాక్యుమెంట్లు, ప్లాట్ కొలతలు, సరిహద్దుల వివరాలు ఆనుకుని ఉన్న రోడ్డు వెడల్పును చూపిస్తూ సైన్ ప్లాన్, సబ్ రిజిస్ట్రార్ వారు ధృవీకరించిన ఈసీ సర్టిఫికెట్, మార్కెట్ విలువ సర్టిఫికెట్ కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్లు పాల్గొన్నారు.

స్థిరంగా సుద్దగడ్డ ఉధృతి



సుద్దగడ్డ వరద ఉధృతితో గొల్లప్రోలు వద్ద వరద ముంపులో వరి పొలాలు

- గొల్లప్రోలులో ఇంకా ముంపులోనే పంటపొలాలు
- వరద నీటిలోనే కొత్తకాలనీ, సూరంపేట వాసుల రాకపోకలు

గొల్లప్రోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది. ఎగువప్రాంతాల నుంచి వరద నీరు దిగువకు వచ్చి చేరుతుండడంతో పంటపొలాలు ముంపలోనే ఉన్నాయి. వరద నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు పడకపోయినా ఎగువ ప్రాంతాలు నుంచి వరద జలాలు వస్తుండడంతో సుద్దగడ్డ, చౌటు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సుద్దగడ్డ వరదనీరు గొల్లప్రోలు పట్టణ శివారు కొత్తకాలనీకి వెళ్లే రహదారులను ముంచెత్తింది. దీనితోవారు నిచ్చెన ద్వారా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని దాటి వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. నీటి ప్రవాహ తాకిడి అధికంగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులను కాలనీవాసులే దగ్గరుండి దాటిస్తున్నారు. మరోవైపు బ్రిడ్జి వద్దకు చేరుకునే మార్గాలు చిత్తడిగా మారడంతో వాటిపై ఇసుకబస్తాలు వేశారు. పట్టణ శివారు సూరంపేట జలదిగ్బంధంలో చిక్కుకుంది. రైల్వేట్రాక్ కిందకు, వెళ్లే మార్గంలో రెండు నుంచి మూడు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ నీటిలో సూరంపేటవాసులు పట్టణంలోకి వచ్చి నిత్యావసరాలు, గ్యాస్ సిలిండర్లు తీసుకువెళ్లుతున్నారు. మరోవైపు సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు ముంపునకు గురయ్యాయి. పాఠశాల చుట్టూ వరద నీరు చేరడంతో తరగతులను సమీపంలోని రామాలయంలో నిర్వహిస్తున్నారు. అరుంధతీయపేట, ఎస్సీ కాలనీల్లోని రహదారులపై వరద నీరు ప్రవహిస్తోంది. వరద పరిస్థితిని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, నగర పంచాయతీ కమిషనరు నామ కనకారావు పరిశీలించారు.

ముంపులోనే పొలాలు

వారంరోజులుగా గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం,తాటిపర్తి, చెందుర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు, మల్లవరం తదితర గ్రామాల్లో 3వేల ఎకరాల్లో వరి పంట ముంపులో కొనసాగుతున్నాయి. వరినాట్లు కుళ్లిపోతున్నాయని రైతులు తెలిపారు. పత్తి పంట పూర్తి దెబ్బతింది. మరోవైపు గొల్లప్రోలు-తాటిపర్తి, చెందుర్తి-తాటిపర్తి రహదారులతోపాటు గొల్లప్రోలు శివారు భాస్కరరావు ఆస్పత్రి రోడ్డుపై సుద్దగడ్డ వరద నీరు ప్రవహిస్తోంది.



ప్రత్తిపాడు మండలంలోని వెంకన్న దొర చెరువు నుంచి పొర్లి బయటకు వస్తున్న నీరు

జిల్లాలో 153.2 మి.మీ వర్షపాతం

- అత్యధికంగా జగ్గంపేటలో 28.6 మిల్లీమీటర్లు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 153.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీనిలో జగ్గంపేట మండలంలో అత్యధికంగా 28.6 మిల్లీమీటర్లు నమోదైంది. తాళ్లరేవులో 14.6 మి.మీ, గండేపల్లి 12.4, గొల్లప్రోలు 10.8, ఏలేశ్వరం 10.4, కాజులూరు 10.2, ప్రత్తిపాడు 9.4, పిఠాపురం 8.6, కోటనందూరు 5.8, రౌతులపూడి 5.8, కిర్లంపూడి 5.8, పెద్దాపురం 5.4, యూ.కొత్తపల్లి 5.0, శంఖవరం 4.8, పెదపూడి 4.6, సామర్లకోట 3.0, తొండంగి 2.8, తుని 2.4, కాకినాడరూరల్ 1.4, కరప 1.2, కాకినాడఅర్బన్ 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

- 30లోపు చెక్‌లిస్ట్ పూరించి సమర్పించాలి: డీఈవో

కాకినాడ రూరల్,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ప్రైవేట్ యాజమాన్యం తప్ప ఇతర అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ కనీసం పదేళ్ల బోధనానుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జిల్లాస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ సూచించారు. deoeg.org వెబ్‌సైట్‌లో ఉంచిన నియమ, నిబంధనలను అనుసరించి అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తును చెక్‌లిస్ట్ పూరించి ఈనెల 30లోపు తనిఖీ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'ఏలేరు'లో పెరుగుతున్న నీటి నిల్వలు 7

సబ్సిడీపై వరివిత్తనాల పంపిణీకి సన్నాహాలు

- జిల్లాలో 30 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 3161 హెక్టార్లు పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. ఈనేపథ్యంలో కొన్నిప్రాంతాల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంవల్ల నాట్లు కుళ్లిపోయాయి. అలాంటి పొలాల్లో మరో పర్యాయం నేరుగా విత్తనాలు వెదజల్లే విధానంలో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. దీంతో రైతులకు పంపిణీ చేసేందుకు విత్తనాలు సబ్సిడీపై కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు జిల్లా వ్యవసాయశాఖ అధికారులనుంచి ప్రతిపాదనలు మంగళవారం వెళ్లాయి. జిల్లాలో వర్షాలవల్ల నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇచ్చేందుకు 30 క్వింటాళ్ల విత్తనాలు కావాలని ఆ ప్రతిపాదనలో పేర్కొన్నారు. 80శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తే రైతుకు మేలు జరుగుతుందని ఆ ప్రతిపాదనలో వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. భారీవర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో సబ్సిడీపై వరివిత్తనాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 61,405 హెక్టార్లలో వరిసాగు చేశారన్నారు. రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు పంపామన్నారు.

ముంపు ప్రాంతాల రైతులకు సబ్సిడీపై విత్తనాలు



గొల్లప్రోలులో వరి పొలాలను పరిశీలిస్తున్న విజయకుమార్

- జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

గొల్లప్రోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుద్దగడ్డ, చౌటుకాలువల వరద కారణంగా వరి పంట నష్టపోయిన రైతులకు 80శాతం సబ్సిడీపై వరివిత్తనాలు అందజేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. సుద్దగడ్డ వరదకారణంగా గొల్లప్రోలు,చేబ్రోలు, లక్ష్మీపురం, సీతానగరం తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన వరి, పత్తి తదితర పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారం వ్యవధిలో రెండుసార్లు వచ్చిన వరదలతో పంటలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఉద్యావన, వ్యవసాయాధికారులు వై.సోమరాజుశేఖర్, కేవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మంచినీటి చెరువుల్లో గంబూసియా చేపల విడుదల


- జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో దోమలు అధికంగా వృద్ధి చెంది విషజ్వరాల ప్రభావం ప్రజలపై పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దోమలను లార్వాదశలోనే ఆహారంగా తీసుకునే గంబూసియా చేపలను జిల్లావ్యాప్తంగా ఉన్న మంచినీటి చెరువుల్లో వదులుతున్నారు. దోమల సంతానోత్పత్తి నివారణలో భాగంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈనెల 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా కాకినాడ కుళాయిచెరువులో మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ గంబూసియాచేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత మంచి నీటినిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి సబ్ యూనిట్లుగా విభజించి సబ్‌యూనిట్ ఆఫీసర్లు, మిగిలిన వైద్య సిబ్బంది సహాయంతో చేపపిల్లలను వేస్తామన్నారు. తద్వారా దోమల లార్వాలను సమూలంగా నివారించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ యాంటీ లార్వల్ ఆపరేషన్ ప్రతిఏటా వర్షాకాలంలో దోమల ఉధృతిని తగ్గించేందుకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి.విల్సన్, డీఐఓ డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఎల్ఏటీవో డాక్టర్ పి.ప్రభాకర్, ఎఫ్ఆర్‌టీసీ ఎంవో డాక్టర్ రవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.



గంబూసియా చేపలను వదులుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

దోమలు.. యమ డేంజర్!



నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

చిన్నదోమ ఎంతో పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు పల్లెల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవలకాలంలో డెంగీ, మలేరియా కేసుల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగాల బారిన పడిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రపంచానికి ఉమ్మడి శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్‌రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భంగా ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినోత్సవంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ప్రకటించింది. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- ప్రాణాంతక వ్యాధులకు కారకాలు
- నివారించకపోతే ప్రమాదమే
- లార్వా, ప్యూపా దశలోనే నాశనం చేస్తేనే మంచిది

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి):



దోమలు అరికట్టేదేలా?

దోమ ఎగురుతున్నప్పుడు పట్టుకోవడం, చంపడం కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నప్పుడు నాశనం చేయడం సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటిపురుగులు, జలగలు అని కూడా పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు లార్వా నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టిలేదా ఇసుకలో పారబోయాలి.ఇలా చేయడంవల్ల లార్వా,ప్యూపా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యల్లో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ 100 నుంచి 200 వరకు గుడ్లను పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లోగా దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతుంది. దోమలు వ్యాప్తి చెంది చిన్న, పెద్ద తేడా లేకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతినెల నిత్యావసరాల మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ లేదా మస్కిటో బ్యాట్ వంటి వాటికి ఖర్చుచేస్తున్నారు. దోమకాటుకు గురైన వ్యక్తి రోగాల బారిన పడడంతో ఆస్పత్రుల పాలై వేల కు వేలు ఖర్చు చేయక తప్పడంలేదు.

ఆడదోమలే ప్రమాదకరం

మగదోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడదోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీలుస్తాయి. ఈక్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతోపాటు వ్యాధికారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంథుల్లోకి చేరుతుంది.ఈ పారాసైట్‌లో కొన్నిమార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు లాలాజలంతోపాటు పారసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడంవల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గూన్యా లాంటి జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమలు కుట్టడంవల్ల బోదకాళ్లు వస్తాయి.

నివారణ ఇలా..

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విషజ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే. మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రీఫిల్స్ కాయిల్స్ వంటివి దోమల నివారణకు ఇంట్లో వాడుతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణకు సహజ పద్ధతిలో చర్యలు చేపట్టడమే ఉత్తమం. వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు. వేప, కొబ్బరి నూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు. ఇళ్లలోకి దో మలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాలవద్ద తులసీమొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూ రం చేస్తాయి. వృద్ధి కాకుండా చేస్తాయి. లెమన్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌సెక్ట్ రిప్లెంట్ గాను పనిచేస్తుంది. కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దాని నుంచి వచ్చే పొగకు దోమల మాయమవుతాయి.



అప్రమత్తంగా ఉండాలి

దోమలనుంచి వచ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలేరియా,డెంగీ వంటి వ్యాధులు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. డెంగ్యూ, మలేరియాలపై ప్రజల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం.

-ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి, ముమ్మిడివరం



దోమల వ్యాప్తిపై వివరిస్తున్న మలేరియా అధికారి



విద్యుత్ అధికంగా వాడుతున్నారా?

- అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు అవకాశం
- 'వీడీఎస్ వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్'ను తీసుకొచ్చిన విద్యుత్‌శాఖ
- స్వచ్ఛందంగా అదనపు లోడ్ వెల్లడించే పథకం
- ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గడువు పొడిగింపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26,460 దరఖాస్తుల రాక

(ఆంధ్రజ్యోతి- కాకినాడ)

'విద్యుత్ వినియోగంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి, అధిక లోడ్ వినియోగదారులపై కేసులు నమోదు చేస్తాం. ఫైన్‌లు వేస్తాం. గృహ వినియోగదారులు లోడు క్రమబద్ధీకరించుకుంటే హెచ్చుతగ్గులుండవు.' ప్రస్తుతం విద్యుత్‌శాఖ అధికారులు చేస్తున్న ప్రచారమిది. విద్యుత్ వినియోగదారుల అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడ సర్కిల్ పరిధిలో మొత్తం 6,998, తూర్పుగోదావరి జిల్లాలో 10,199, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 9,263 దరఖాస్తులు వచ్చాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26,460 దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి గృహ విద్యుత్ వినియోగంలో విద్యుత్ వాడకానికి సంబంధించి అదనపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు స్వచ్ఛంద అదనపు లోడ్ వెల్లడి పథకం (వీడీఎస్ వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్)ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. వినియోగదారులు వారు వాడుతున్న విద్యుత్ వాడకాన్ని అనుసరించి అదనపు లోడ్ ఏర్పాటు చేసుకోవడానికి 50శాతం సబ్సిడీ కల్పిస్తోంది. విద్యుత్ వినియోగదారుల నుంచి ఈ మేరకు చార్జీలు వసూలు చేస్తోంది. ఈ విద్యుత్ రాయితీకి సంబంధించి దర ఖాస్తుల స్వీకరణ తేదీ జూన్ 30 అని తొలుత ప్రకటించినా.. ఆ గడువును డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. సాధారణంగా ఒక కిలోవాట్‌కు దరఖాస్తు ఫీజు రూ.50, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏపీఈపీడీసీఎల్ ప్రకటించిన వీడీఎస్ పథకంలో కిలోవాట్‌కు రూ.1250, రెండు కిలోవాట్లకు రూ.2450, మూడు కిలోవాట్లకు రూ.3,650 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ మేరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అంటే 50 శాతం రాయితీతో లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చారు. కాకినాడ జిల్లాలో 6,68,126 మంది వినియోగదారులు ఉన్నారు. వాణిజ్య, వ్యాపార, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ, ఆక్వా ఇతర అనుబంధ రంగాల కేటగిరీలో మరో లక్షా 25 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడ సర్కిల్‌లో జగ్గంపేట డివిజన్ (జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని సబ్ డివిజన్లు) 1510 దరఖాస్తులు, కాకినాడ డివిజన్(కాకినాడ, కరప, సర్పవరం సబ్‌డివిజన్లు) 3212 దరఖాస్తులు, పెద్దాపురం డివిజన్ (పిఠాపురం, సామర్లకోట సబ్‌డివిజన్లు) 2276 ఇలా మొత్తం కాకినాడ సర్కిల్‌లో 6998 దరఖాస్తులు వచ్చాయి. 11558.99 కిలోవాట్ల అదనపు లోడు కోరుతూ ఇవి వచ్చాయి. డెవలప్‌మెంట్ చార్జీల కోసం రూ.107.41 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.24.21 లక్షలు, ఎస్ఎల్‌సీ రూ.2.31 లక్షలు వసూలైంది. వాస్తవానికి విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇలా అందరి ఇళ్లల్లోనూ కనిపిస్తున్నాయి. నిర్దేశించిన లోడు కన్నా ఎక్కువ వాడుతున్నారు. అదనపు లోడ్ భారం ట్రాన్స్‌ఫార్మర్లపై పడి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇలాంటి సమస్యలు అధిగమించేందుకే ఈపీడీసీఎల్ గృహ విద్యుత్ వినియోగదారు లకు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తోంది.

ఒక్కో జిల్లాకు కోటి

- వరద సహాయక చర్యలకు ఉమ్మడి జిల్లాకు రూ.3కోట్లు
- తక్షణ చర్యలకు వెచ్చించాలని ప్రభుత్వం ఆదేశాలు
- సురక్షిత ప్రాంతాలకు వరద బాధితులను తరలించాలని సూచన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బాధిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాకు రూ.కోటి చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.3కోట్లు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో వర్షాలు, వరద ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, వైద్య సేవలు అందించాలని కలెక్టర్లను ఆదేశించింది. ఆర్టీసీ బస్సులను తరలించి వరద ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ సంస్థ అధికారులు వర్షాలు, వరద ముప్పు ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. అటు గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లాలో నాలుగు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండండి

- ఐజీ, ఈగల్ చీఫ్ రవికృష్ణ
- నన్నయ యూనివర్శిటీలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం



ఈగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ఐజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తాను రాజమహేంద్రవరంలో పుట్టి పెరిగి, ఇక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశానని, నన్నయ యూనివర్శిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్‌నేరాల పెరుగుదలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. దీని పట్ల యువత అవగాహన కలిగి ఉండి సమాజానికి, పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలపై సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 1930 కు తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో నేరాలకు అడ్డాగా ఉన్న ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని పదేళ్ల నుంచి నేరాలు లేకుండా అరికట్టి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత విషయం కాదని, కుటుంబాల భవిష్యత్తును క్షీణింపజేసే సామాజిక అంటువ్యాధి అని అన్నారు. యువత మనస్సులు నూతన ఆవిష్కరణలు, నాయకత్వం, ప్రేరణ కోసం ఉద్దేశించబడాలన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు మాట్లాడుతూ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను ఐజీ నివృత్తి చేశారు. డ్రగ్స్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని, వాటి జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ రూపొందించిన డ్రగ్స్ సైబర్‌నేరాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, సౌతోజోన్ డీఎస్పీ భవ్యశ్రీ, ఈగల్ డీఎస్పీ పి.సూర్యమోహనరావు, నన్నయ డీన్ ఆచార్య ఎన్.ఉదయభాస్కర్, న్యాయాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు

- మాల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ,ఉపాధి కల్పనలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు కేటాయించిందని రాష్ట్ర మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటించిన ఆయన ఉదయం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతోను, ఎస్సీ మాల సంక్షేమ, యువజన సంఘాలతో సమావేశమై కార్పొరేషన్ ద్వారా చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించి, సూచనలు, సలహాలు స్వీకరించారు. మధ్యాహ్నం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో ఈ సంవత్సరం 26,200 మందికి ఉపాధి రుణాలు కల్పించే ప్రణాళిక అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నాక్ సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ యువతలో ఆర్థిక అక్షరాస్యతను, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించి 2047 నాటికి ఎస్సీ కుటుంబాల్లో ప్రతీ ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త,పారిశ్రామికవేత్త ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సహాయ కార్యక్రమాలను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు.జిల్లాలో వనరుల ఆధారంగా ఎస్సీ మాలల ఆర్థిక ప్రగతికి లోకలైజ్డ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని చైర్మన్ విజయ్‌కుమార్ చెప్పారు. సమావేశంలో మాల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దానం లాజర్ బాబు, కొల్లాబత్తుల అప్పారావు, చెల్లు అశోక్, మద్దా మణి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.సత్యవతి, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు



సామర్లకోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు

పెద్దాపురం/సామర్లకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 23న పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పట్టణంలోని మానోజ్ చెరువు, ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉందన్నారు.అలాగే సామర్లకోట పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగే సీఎం ప్రజా వేదిక సభ ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే చిన రాజప్ప, అధికారులు పరిశీలించారు. అదే ఆవరణలో టీడీపీ కార్యకర్తల సమావేశం కూడా జరుగుతుందని సమాచారం. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కార్పొరేషన్ కమిషనరు భావన, డీఆర్వో వెంకటరావు, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, పీసీబీ కార్యనిర్వాహక ఇంజనీర్ శంకరరావు, డీపీవో వి.రవికుమార్, సీపీవో త్రినాథ్, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సామర్లకోట కమిషనరు శ్రీవిద్య పాల్గొన్నారు.

తగ్గుతూ..పెరుగుతూ..

- ఎగువున పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం

ధవళేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి పరివాహకం ఎ నుంచి వరద గోదావరికి చేరుతుండడంతో ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుతూ ప్రవహిసోంది. కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం ఉదయం 6గంటలకు అత్యధికంగా 8,23,083క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా నీటి మట్టం 10.40అడుగులకు చేరుకుంది. ఆపై మధ్యాహ్నం 11గంటల వరకు అదే రీడింగ్ వద్ద నిలకడగా కొనసాగిన నీటి మట్టం తరువాత తగ్గుముఖం పడుతూ సాయంత్రానికి 9.90 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ ద్వారా7,40, 578 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. బుధవారం ఉదయానికి 10 లక్షలకు చేరుకోవచ్చని అధికారుల అంచనా. ఎగువున భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 8గంటల వరకు పెరిగిన నీటి మట్టం 38.30 అడుగులకు చేరుకుంది. ఆపై క్రమంగా తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి 36.30 అడుగులకు చేరుకుంది.

దిగ్బంధనంలో గ్రామాలు

చింతూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీడని ముసురు, ఎటు చూసినా వరద నీరే.. రోజంతా చలిగాలులు. దిగ్బంధనంలో గ్రామాలు, దీంతో లోతట్టు వాసులు ఇక్కట్లు పడుతున్నారు. సోమవారం రాత్రి చింతూరు వద్ద 33 అడుగులకు చేరుకున్న శబరి ఉధృతి మంగళవారం ఉదయం కాస్త తగ్గి 31 అడుగులకు చేరింది. తిరిగి మంగళవారం సాయంత్రానికి 33 అడుగులు దాటి ప్రవహిస్తోంది. అదే సమయంలో భద్రాచలం వద్ద 36.80 అడుగుల మేర ప్రవహిస్తోంది.దీంతో లోతట్టు వాసుల్లో ఆందోళన అలుముకుంది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి 3.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయ డంతో గోదావరి ఉధృతి పెరిగింది. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవచ్చని అధి కారులు అంచనా వేస్తున్నారు. దీంతో శబరి ఉధృతి కూడా మరింత పెరగొచ్చని అంటున్నారు. శబరి ఉధృతితో ఛత్తీస్‌గఢ్ ఒడిస్సాల నడుమ సుక్మా సమీపంలో నదిపై నిర్మించిన వంతెన నీట మునిగింది. అదే దశలో ఆంధ్రా-ఒడిస్సా 30వ జాతీయ రహదారి నిమ్మలగూడెం వద్ద నీట మునిగింది.చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై చీకటి వాగు, సోకిలేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు-కూనవరం ప్రధాన రహదారిపై కోంద్రాజపేట వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముసురు పట్టి రోజంతా వర్షం కురియడంతో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం కూడా చింతూరు మండలంలో 16 గ్రామాలు దిగ్బంధనంలోనే ఉన్నాయి. ఇదిలా వుండగా చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ప్రతి బుధవారం జరిగే గ్రీవెన్సును వరదలు, వర్షాల కారణంగా రద్దు చేస్తున్నట్టు పీవో అపూర్వ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర రహదార్లపై వరద నీరు చేరడంతో చింతూరు మండలం చట్టి వద్ద 30వ నెంబరు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే వాహనాలన్నీ నిలిచిపోయి బారులుదీరాయి.



ధవళేశ్వరం బ్యారేజీ దిగువున ప్రవహిస్తున్న వరద నీరు



ఛత్తీస్‌గఢ్-ఒడిస్సా రోడ్డులో సుక్మా వద్ద నీట మునిగిన వంతెన



చింతూరు: చట్టి వద్ద నిలిచిపోయిన వాహనాలు



చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై వరద నీరు

కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయాలి

- కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కోరిన ఎంపీ సతీష్‌బాబు



మంత్రి మాండవియాతో సతీష్‌బాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నందున ఖాళీలను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మంగళవారం ఢిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి యువజన, క్రీడా వ్యవహారాల శాఖల మంత్రి మాన్సుఖ్ మాండవియాను కలిసి కోరారు. 500 పడకల సామర్థ్యం ఉన్న కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రికి మొత్తం 205 పోస్టులు మంజూకాగా 88 కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో స్పెషలిస్టులు, సీనియర్ రెసిడెంట్స్, నర్సింగ్ ఆఫీసర్లు, టెక్నీషియన్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. సిబ్బంది కొరత వల్ల రోగులకు సమయానికి వైద్యం అందించడంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఖాళీలను తక్షణమే భర్తీ చేసి ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేలా చూడాలని మంత్రిని కోరారు.

ఖేలో ఇండియా ప్రాజెక్టులను పూర్తి చేయాలి.. అలాగే రాష్ట్రంలో జాతీయ క్రీడా ప్రావీణ్య కేంద్రాల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న ఖేలో ఇండియా ప్రాజెక్టుల పూర్తి, ప్రతి జిల్లాలో అదనపు ఖేలో ఇండియా సెంటర్లు, రాయలసీమలో కొత్త ఎస్ఏఐ ట్రైనింగ్ సెంటర్ స్థాపన వంటి ప్రతిపాదనలను సమర్పించారు. ఈ మేరకు ఎంపీ సతీష్‌బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వేదశాస్త్ర పండిత సన్మాన సభ

సామర్లకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మంగళవారం బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్ 27వ వేదశాస్త్ర పండిత సన్మాన సభ జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఘనాపాఠీలు వచ్చి వేదాలు పఠించారు. పరిషత్ కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ఈవో బళ్ల నీలకంఠం నేతృత్వంలో నిర్వహించిన సభకు హాజరైన పండితులు చతుర్వేద పారాయణ, వేదస్వస్తి నిర్వహించారు. అనంతరం పండిత సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జ్యోతిషుడు చీమలకొండ ప్రసాద్, భీమే శ్వర అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి చుండ్రు గోపా లకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సింగవరపు సత్యనారాయణ, గుండు శంకరరావు, కాపుగంటి పైడిరత్నం, బుర్రే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కన్నేసి.. స్థలం కబ్జా చేసి!

రాజమహేంద్రవరంలో ఐదుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): స్థలం కాజేసిన ఐదుగురిని రాజమహేంద్రవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య మంగళవారం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గొల్లపల్లి కాశీ విశాలాక్షి వైద్యురాలిగా పనిచేస్తుండేవారు. 1997లో తన కుమారులు గొల్లపల్లి వినోద్, గొల్లపల్లి లక్ష్మణ్ పేరున కవలగొయ్యి గ్రామ పరిధి లోని ఎస్ఆర్ నెం.496లో ప్లాటు నెం.39 ద్వారా 267చదరపు గజాలు.. దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో ప్లాట్ నెం.204లో వినోద్ పేరున 267చ.గ., లక్ష్మణ్ పేరున ప్లాట్ నెం.203లో 267 చదరపు గజాల స్థలాన్ని కొన్నారు. ఆమె భర్త 2012లో మరణించడంతో తన స్వగ్రామం ఆకివీడు మండలం కుప్పనపూడి వెళ్లిపోయారు. తర్వాత కుమారులు ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. విశాలాక్షి కూడా అమెరికా వెళ్లారు. ఇటీవల స్వగ్రామం వచ్చి స్థలాలను ఒకసారి పరిశీలించుకుందామని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అవి వేరొక వ్యక్తులకు క్రయంగా దాఖలు పడ్డాయని తెలియడంతో అవాక్కయ్యారు. దొంగ రిజిస్ట్రేషన్లు జరిగాయని గ్రహించి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సీఐ కాశీ విశ్వనాథ్ టీం దర్యాప్తు ప్రారంభించింది. దీంతో పలు విషయాలు వెలుగు చూశాయి. రియల్ ఎస్టేటు బ్రోకర్లుగా ఉన్న మద్దిరెడ్డి లక్ష్మీ నారాయణ, మద్దిరెడ్డి నాగేంద్ర ప్రసాద్(సిటీ బస్సు ప్రసాద్)కి 2013 జనవరిలో షేక్ ఫకీర్ మహమ్మద్ ఖాసిం బాషా అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఏవైనా ఎక్కువ కాలం ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి తన దృష్టికి తెస్తే నకిలీ దస్తావేజులు తయారు చేసి అమ్ముకోవచ్చని, అధిక మొత్తంలో సొమ్ము వస్తుందని చెప్పాడు. వాళ్లు తమకు తెలిసిన రియల్ ఎస్టేటు వ్యాపారుల నుంచి విశాలాక్షి కుమారులకు సంబంధించిన ప్లాట్ల దస్తావేజు జిరాక్సులను తీసుకెళ్లి ఖాసింకి ఇచ్చారు. అతడు నకిలీ జిరాక్సు కాపీలతో ఒరిజినల్ దస్తావేజులను తయారు చేయించాడు. రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రేషను సమయంలో ధవళేశ్వరానికి చెందిన పాతూరి ప్రసాద్, సబ్బితి భాస్కరరావుకు రూ.20వేల చొప్పున ఇచ్చి వినోద్, లక్ష్మణ్‌గా నటింపజేసి రిజిస్ట్రేషను ప్రక్రియ పూర్తి చేశారు. రిజిస్ట్రారు కార్యాలయంలో ఏ విధంగా నడుచుకోవాలనే విషయంపై కొవ్వూరుకు చెందిన యాదగిరి సురేశ్, గాలి రాజేంద్ర ప్రసాద్‌తో తర్ఫీదు ఇప్పించారు. నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, దస్తా వేజులతో మరికొందరితో కలిసి నకిలీ రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆపై వేరొకరికి విక్రయించేశారు. ఈ కేసులో షేక్ ఫకీర్ మహమ్మద్ ఖాసీం బాషా, మద్దిరెడ్డి లక్ష్మీ నారాయణ, మద్దిరెడ్డి నాగేంద్రప్రసాద్, సబ్బితి భాస్కరరావు, యాదగిరి సురేశ్‌ని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. ఖాళీ స్థలం కనబడితే కర్చీఫ్ వేసి కాజేస్తామంటే ఉపేక్షించేది లేదని, కబ్జా వ్యవహారాలపై పటిష్ట నిఘా పెట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఎక్కువ కాలం తమ స్థలాలను పట్టించుకోకుండా ఉండడం సరికాదని, పరిశీలించుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. అయితే రిజిస్ట్రేషను ఎలా జరిగిందనే అంశంపై విమర్శలు, అప్పటి సబ్-రిజిస్ట్రారుపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వినవస్తున్నాయి.

1 నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు

అంతర్వేది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో సెప్టెంబరు 1 నుంచి 4 తేదీ వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అంకురార్పణ, ఆదివాసవములు..


శ్రీలక్ష్మీనరసింహస్వామి

2,3 తేదీల్లో అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమాలు, పవిత్రారోహణ, 4వ తేదీ గురువారం ఉదయం మహాశాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, రాత్రి పవిత్రఅవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పం, పవిత్రముల వినియోగం జరుగుతుందని ఏసీ తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ భాద్రపద శుద్ధ నవమి నుంచి ద్వాదశి వరకు స్వామివారి పవిత్రోత్సవాలు దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, స్వామివారి దివ్యతేజో ప్రకాశములు కలగాలని, సర్వప్రాయశ్చిత్యార్థం పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

శ్రీసిద్ధివినాయకుడి హుండీల ఆదాయం రూ.44.11 లక్షలు


సిద్ధివినాయకుడి ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడి హుండీలను మంగళవారం లెక్కించారు. 90 రోజులకు ఆలయ ప్రధాన హుండీ నుంచి రూ.42,81,1787, అన్నప్రసాద హుండీ నుంచి రూ.1,30,115 వెరసి మొత్తం రూ.44,11,902 నగదు, 173 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ నోట్లు 33 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ పేర్కొన్నారు. తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, ట్రైనింగ్ సహాయ కమిషనర్ ఎం.మంజులాదేవి, జిల్లా దేవాదాయశాఖాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. అర్చకులు, గ్రామస్తులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీపై సెన్సూర్ జరిమానా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కొవ్వూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టీ.శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధించినట్టు ఎక్స్ అఫిషియో స్పెషల్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కొవ్వూరు ఏఎంసీలో సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా పనిచేసిన టి.శ్రీనివాసులు ప్రస్తుతం కాకినాడ జిల్లా కరప ఏఎంసీలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఉన్న 2ఎగ్జిక్యూటివ్ పిటీషన్ కేసుల్లో ఉత్తర్వులు ఉన్నా ప్రతి వాది జీతం అటాచ్‌మెంటు చేయడంలో విఫలమైనందుకు సెక్రటరీ శ్రీనివాసులుపైనా అభియోగం మోపారు. భవిష్యత్‌లో ఇటువంటి తప్పులు పునరావృత్తం కాదని సెక్రటరీ హామీ ఇవ్వడంతో పాటు ఆర్టికల్ ఆఫ్ చార్జి నుంచి విముక్తి చేయాలని కోరారు. మొత్తం విషయాలను పరిశీలించిన అనంతరం ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు నియమం 9 ప్రకారం శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి ఇరుక్కున్న డ్రైవర్

గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ఇంజన్ భాగంలో ఇరుక్కున్న డ్రైవర్ విష్ణు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు దమ్ము ట్రాక్టర్ తిరగబడి స్టీరింగ్ భాగంలో డ్రైవర్ ఇరుక్కున్న ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గన్నవరం గ్రామానికి మోరంపల్లి విష్ణు గౌరిదేవిపేటలోని ఓ రైతు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వరినాట్లు సిద్ధం చేసేందుకు పొలాలను దమ్ము చేస్తున్నాడు. పొలంలో అక్కడక్కడ గోతులు ఉండడంతో దమ్ము ట్రాక్టర్ ఒక్కసారిగా తిగబడిపోయింది. డ్రైవర్ విష్ణు ట్రాక్టర్‌ను బయటికు తెచ్చేందుకు ప్రయత్నించే క్రమంలో ఇంజన్‌భాగం, స్టీరింగ్ మధ్య ఇరుక్కుపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి విష్ణును బయటకుతీశారు. గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తర్వాత మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రయివేట ఆసుపత్రికి తరలించారు.

పెళ్లింట్లో అగ్నిప్రమాదం

వంట, వివాహ సామగ్రి పూర్తిగా దగ్ధం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురం (అగ్రహారం)లో మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో వాటాల సూర్యనారాయణ తాటాకిల్లు దగ్ధమైంది. సూర్యనారాయణ కుమారుడు పోసయ్య పెద్ద కుమార్తెకు గురువారం వివాహం కావాల్సి ఉండగా సోమవారం ఆమెను పెళ్లి కుమార్తెను చేశారు. దీంతో బంధువులతో ఇల్లు సందడిగా ఉన్న సమయంలో గ్యాస్‌పై వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. వంట, వివాహ సామగ్రి పూర్తిగా కాలిబూడిదైనట్టు రోజువారీ కూలీలైన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండపేట ఫైర్ ఆఫీసర్ ఎం.వెంకట్రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ అర్జమ్మ, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించి బాధితుల వివరాలను నమోదు చేశారు. బాధిత కుటుంబానికి తక్షణసాయంగా 25 కిలోల బియ్యం అందజేసినట్టు తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మండపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, కుటుంబంలో కలహాలతో కలత చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో మంగళవారం జరిగింది. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారపూడి శ్మశానవాటికలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడు మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన మల్లేశ్వరపు వెంకటేశ్వరరావు(35)గా గుర్తించారు. అతడికి భార్యతో గొడవల కారణంగా ఆమె పిల్లలతో ఏడిదలోనే వేరుగా ఉంటుంది. వెంకటేశ్వరరావుకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ద్వారపూడిలో శ్మశానవాటిక వెనక చెట్టుకు ఉరివేసుకోవడంతో కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుడి ప్యాంట్ జేబులో లభ్యమైన పుస్తకంలో తన మరణానికి తానే కారణమని, మరెవరు కాదని రాసి ఉందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేశారు.

బురద రోడ్డులో వరి నాట్లు వేసి నిరసన


రహదారిపై నాట్లు వేస్తున్న మహిళలు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏటా వర్షాకాలంలో బురద రహదారిలో పడుతున్న అవస్థలపై ఆదివాసీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీలోని చింతల చెరువు గ్రామంలోని అంతర్గత రహదారి నడవడానికి వీల్లేకుండా బురదమయంగా తయారవడంతో మహిళలు వరి నాట్లు వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి రహదారిని అభివృద్ధిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోందని పేర్కొన్నారు.

‘ఏలేరు’లో పెరుగుతోన్న నీటి నిల్వలు


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరులో జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకు పెరుగున్నాయి. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 525 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్న డూ లేనిరీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 79.25 మీటర్ల స్థాయిలో 12.59 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

జూజిట్సు క్రీడ జాతీయ రిఫరీగా అంజి


అంజికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు యాసిన్

అమలాపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన జూజిట్సు క్రీడకు జాతీయ రిఫరీగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన పడాల అంజి నియమితులయ్యారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఒక భాగమైన జూజిట్సు క్రీడను ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక క్రీడగా ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఉర్దూ మాస్కన్ హాలులో నాలుగు రోజులు తెలంగాణ జూజిట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోటీలు, అవగాహన తరగతులు నిర్వహించారు. అంజి కార్యక్రమంలో పాల్గొని నేషనల్ రిఫరీగా ఉత్తీర్ణులయ్యారు. అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి జూజిట్సు చాంపియన్ షిప్ పోటీలకు రిఫరీగా అంజి హాజరుకానున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాసిన్, ప్రధాన కార్యదర్శి ఎన్.గురు ప్రభాకరరావు చేతులమీదుగా అందుకున్నారు.

రూ.150కే మేలు జాతి పాడి పశువుల వీర్యం

ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వాహణాధికారి

శంఖవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రూ.150కే మేలు జాతి పాడి పశువుల వీర్యాన్ని అందజేస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వాహణ అధికారి కే.కాంతారావు తెలిపారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణతో రైతులు ఆర్థికంగా లాభం పొందవచ్చిని చెప్పారు. మంగళవారం కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో పశు వైద్యశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంవర్ధకశాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పాడిపశువుల పెంపకంలో మేలు జాతి పశువులే అధిక పాలు ఇస్తాయన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పాడి పశువులకు నాణ్యమైన మేలు జాతి పాడి పశువుల వీర్యాన్ని తక్కువ ధరలో అందజేస్తున్నట్టు తెలిపారు. గతంలో రూ.500 ధర ఉండగా ప్రస్తుతం రూ.150 కే అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతు పశుపోషణలో ఆధునిక పద్ధతులు పాటించాలని కోరారు.


కాకినాడ జిల్లా శంఖవరంలో మాట్లాడుతున్న కాంతారావు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో గాయని కౌసల్య

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య

తునిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య అన్నారు. కాకినాడ జిల్లా తునిలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా 2 రోజుల పాటు విద్యాసంస్థల శాఖలైన తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం విద్యార్థులకు గాతా రహే మేరా దిల్ పేరిట పాట పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గాయని కౌసల్య, కీబోర్డు ప్లేయర్ రవి శేఖర్ వ్యవహరించారు. కౌసల్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం తన పాటలతో అలరించారు. విజేతలు, అతిథులకు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ బహుమతులు అందజేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, వివిఎస్ఎస్ భానుమూర్తి, డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి కన్నబాబుకు పితృ వియోగం


సత్యనారాయణ (ఫైల్)

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు పితృ వియోగానికి గురయ్యారు. గత కొంతకాలంగా అనారోగ్య రుగ్మతలతో ఆయన తండ్రి సత్యనారాయణ (76) బాధపడుతున్నారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని వైద్యనగర్‌లో గల కన్నబాబు నివాసం వద్దకు తీసుకువచ్చారు. ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, గుడివాడ అమర్‌నాథ్, జోగి రమేష్, సీహెచ్.వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధా, తోట నరసింహం, ఎం భరత్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జగ్గిరెడ్డి, జక్కంపూడి రాజా, టీడీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు సత్యనారాయణ పార్థీవదేహానికి నివాళులర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని భారీ ఊరేగింపుగా కాకినాడ ఆర్టీసీ సమీపంలో శ్మశానవాటికకు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంతాపం వ్యక్తం చేశారు.

కోడలితో గొడవ... ఇంటి నుంచి వెళ్లిపోయిన అత్త

కరప, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అత్తాకోడళ్ల మధ్య వివాదంతో మనస్తాపం చెందిన అత్త ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టకు చెందిన నురుకుర్తి సత్యనారాయణమ్మ, ఆమె కోడలు హిమబిందు మధ్య ఈ నెల 18న మధ్యాహ్నం ఏదో విషయంలో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరగడంతో కుటుంబ సభ్యులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మనస్తాపం చెందిన సత్యనారాయణమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు శివశంకర్ మంగళవారం కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వీధికుక్కల దాడిలో 11 మేక పిల్లలు మృతి


మృతిచెందిన మేక పిల్లలు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 11 మేక పిల్లలు మృతి చెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురంలో జరిగింది. గ్రామానికి చెందిన బుద్దుల భద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి కూలీ పనులకు వెళ్లారు. మేకల దొడ్డిలోని మేక పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయడంతో 11మేక పిల్లలు మృతి చెందాయి. మేక పిల్లల విలువ రూ.1 లక్ష వరకు ఉంటుందని బాధితుడు భద్రయ్య తెలిపాడు.

బాలుడికి తీవ్ర గాయాలు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామానికి చెందిన 4ఏళ్ల మహిమాన్విత్‌పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇంటి బయట ఆడుకుంటున్న మహిమాన్విత్‌ను వీధి కుక్కలు మెడ, తల భాగంపై తీవ్రంగా కరిచాయి. బాలుడి అరుపుతో తల్లిదండ్రులు కుక్కలను తరిమి బాలుడిని రక్షించుకున్నారు. తండ్రి రత్నరాజు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో చిన్నవంతెన సమీపంలో ప్రధాన పంటకాలువలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సుమారు 55 ఏళ్లు ఉండే వ్యక్తి మృతదేహాన్ని పైకి తీసి శవపంచనామా అనంతరం మండపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. వీఆర్వో సాకా సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎవరైనా మిస్సింగ్ అయితే తమను సంప్రదించాలని కోరారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

రౌతులపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన గండేపల్లి దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... గంజాయి కేసులో పరారీలో ఉన్న దుర్గాప్రసాద్‌ను రౌతులపూడి గ్రామశివారు మరిడమ్మ ఆలయం దగ్గర మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.

మబ్బులు.. అందాలు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో మంగళవారం ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకుని ప్రకృతి అందాలు కనువిందు చేశాయి – ప్రత్తిపాడు ఆంధ్రజ్యోతి



కాకినాడ

22న కాకినాడ నుంచి ప్రత్యేక బస్సు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, మంత్రాలయం, అహోబిలం, మహానంది, యాగంటి, త్రిపురాంతకం, కోటప్పకొండ, విజయవాడ క్షేత్రాల దర్శనానికి ఈ నెల 22న కాకినాడ డిపో నుంచి సూపర్‌లగ్జరీ ప్రత్యేక బస్సు బయలేర్దరుతుంది. 25వ తేదీ రాత్రి 9 గంటలకు కాకినాడ చేరుతుందని డిపో మేనేజరు మనోహర్ తెలిపారు. టికెట్ ధర రూ.3,300. ఆసక్తి గల వారు 7382910869 నెంబరును సంప్రదించాలన్నారు.

దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైయున్న పంచాయతన



సమేత ఉమారామ లింగేశ్వరస్వామికి శ్రావణమాసం, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతి పూజ, మహన్యాసపారాయణం, ఏకాదశ ద్రవ్య మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని వివిధ రకాల పుష్పమాలలతో అలంకరించి సప్తహారతులు ఇచ్చారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పూజలు చేయగా సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకటప్పయ్య డ్రెయిన్‌లో చేపల బోనులు

ముంపునకు గురవుతున్న పొలాలు



కరప, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపు నీటిని సముద్రంలోకి తరలించే ప్రధానమైన డ్రెయిన్లలో వెంకటప్పయ్య డ్రెయిన్ ఒకటి. ఇది ఆక్రమణలకు గురై పూడుకుపోవడంతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్థానిక నాయకుల సహకారంతో యుద్ధప్రాతిపదికన తవ్వించారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఈ డ్రెయిన్ నుంచి ముంపునీరు పారక దాన్ని చేర్చి ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. దీనికి ప్రధాన కారణం వెంకటప్పయ్య డ్రెయిన్‌లో ఎక్కడికక్కడ ఏర్పాటుచేసిన చేపల బోను (మావు) లేనని పాతర్లగడ్డ, పెనుగుదురు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది చేపల కోసం డ్రెయిన్‌కు అడ్డంగా పలుచోట్ల బోనులు, బరకాలను ఏర్పాటుచేసి నీటి ప్రవాహానికి అవరోధం కలిగించారు. దీంతో ముంపునీరు కిందకు లాగక పెనుగుదురు, పాతర్లగడ్డ, గురజనాపల్లి గ్రామాల్లోని పంట పొలాలు నిండా మునిగాయి. కొంతమంది తమ స్వార్థం కోసం ఏర్పాటుచేస్తున్న బోనుల వల్ల ఖరీఫ్ ప్రారంభంలోనే నష్టపోవాల్సిన దుస్థితి దాపురించిందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక కూటమి నాయకులు స్పందించి రైతుల సహకారంతో డ్రెయిన్‌లో ఏర్పాటుచేసిన కొన్ని బోనులను తొలగించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వెంకటప్పయ్య డ్రెయిన్‌లో ఇంకా పలుచోట్ల ఈ బోనులు ఉన్నాయని... అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటిని తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వెంకటప్పయ్య డ్రెయిన్‌లో చేపల కోసం ఏర్పాటుచేసిన బోనులను తొలగిస్తున్న రైతులు



శ్రీకృష్ణ భగవానుడిని ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు

కాకినాడ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కాకినాడ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం నగరంలోని పురవీధుల్లో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. కాకినాడ కమిటీ అధ్యక్షుడు సలాది అనిల్‌కుమార్, సభ్యులు సాయి, శేఖర్ శాంతరాజు, సత్యనారాయణ ఆధ్వర్యం వహించారు. అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్య నారాయణరాజు, కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, జనసేన కాకినాడ నగర ఉపాధ్యక్షుడు తలాటం సత్య, వరహాలబాబు విచ్చేసి పూజలు జరిపారు.

సమస్యల పరిష్కారానికే 'మన ఊరు-మన సుభాష్'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సుభాష్

కాజులూరు (కరప), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు 'మన ఊరు-మన సుభాష్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కాజులూరు మండలం జగన్నాథగిరిలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు మంత్రి హామీ ఇచ్చారు. ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న బొజ్జపు మంగ (జగన్నాథగిరి), సన్నపు నాగమణి (శివల)లకు మంత్రి రూ.20వేలు చొప్పున చెక్కుల రూపంలో ఆర్థిక సాయం అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.





కాకినాడలో రక్తదానం చేస్తున్న యువకులు, సామర్లకోట మండలం కొప్పవరంలో విద్యార్థికి నిత్యావసరాల కిట్, దుస్తులు అందజేస్తున్న దృశ్యం

ఘనంగా ఎంపీ సతీష్‌బాబు పుట్టినరోజు

కాకినాడ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కాకినాడ మెయిన్‌రోడ్ గ్లాస్‌హౌస్ సెంటర్‌లో గల శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో మొగలి తేజ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు వంద మంది యువతీ, యువకులు రక్తదానం చేశారు. వీరిని బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు బొల్లం సతీష్, మొగలి తేజ, పితాని జయరాం, దేవు వెంకన్న అభినందించారు. కరపకు చెందిన పీజీ సత్యనారాయణ ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే నిమిత్తం రూ.10వేలు నగదును శ్రీయువసేన అధ్యక్షుడు సతీష్‌కు అందజేశారు. ట్రస్టు సభ్యులు వంకాయల రాజ్‌కుమార్, కోన సతీష్, పెరల్స్ హరీష్, వాసిరెడ్డి విశ్వనాథ్, పితాని తేజ, మున్నా, రామ్, ర్యాలి సతీష్, విజయ్, కృష్ణశ్రీ, ఫణి, దీపు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లోని జనావళి వృద్ధాశ్రమంలో టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీ సతీష్‌బాబు పుట్టినరోజు జరిపారు. కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. వృద్ధులకు బ్రెడ్‌లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకుడు మందపల్లి శ్యామ్, నాయకులు వెలిగొట్ల శ్రీనివాస్, మహిపాల శ్రీనివాస్, కాటూరి తిరుమలరావు, పళ్ల జగదీష్, గుత్తుల రవికుమార్, దమ్ము నూకరాజు, బండి బుజ్జిబాబు, పాలిక ప్రసాద్, లోవబాబు, వల్లంపల్లి నారాయణ, కృష్ణారెడ్డి, పాకలపాటి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కొప్పవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో ఎంపీ తనయుడు శ్రీసూర్య భారీ కేక్ కట్ చేశారు. ఆశ్రయ వికలాంగ సమాఖ్యకు చెందిన 500 మంది విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాల కిట్లు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అరిగెల శ్రీనివాసు (బుస్సీ), నులుకుర్తి వెంకటేశ్వరరావు, చింతపల్లి అర్జున్, న్యూటన్ ఆనంద్, చీకట్ల వెంకటేష్, పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, గింజాల శ్రీనివాసు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, గంజి గోపీ. బొబ్బిలి గోవిందు, కాకరపల్లి చలపతిరావు, రామదేవు సీతయ్యదొర, భమిడిపాటి రామకృష్ణ, హనుమంతు ప్రసాద్, రామచంద్రరావు, రాయుడు దుర్గ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి వెండి కిరీటం అందిస్తున్న భక్తులు

శ్రీవిజయ సత్తెమ్మ తల్లికి వెండి కిరీటం సమర్పణ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట శివారు ఈశ్వర్ నగర్‌లో శ్రీవిజయ సత్తెమ్మ తల్లికి భక్తులు సుమారు 2.5 కిలోల వెండితో రూ.3 లక్షలు విలువ చేసే కిరీటం చేయించారు. మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం కిరీటాన్ని అమ్మవారికి విశేషాలంకరణ చేసేందుకు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. భక్తులను వారు అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే చినరాజప్ప



ద్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన డ్వాక్రా రుణమేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 39 డ్వాక్రా సంఘాలకు రూ.6.28కోట్ల చెక్కులను అందజేశారు. ఏపీఎం సూర్యనారాయణ, నూనె రామారావు, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో సామూహిక సత్య దత్త వ్రతాలు



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో సోమవారం సామూహిక సత్యదత్త వ్రతాలు జరిగాయి. మహారాష్ట్ర, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీపాదశ్రీవల్లభులకు అభిషేకాలు, సర్వపుష్పార్చన జరిగాయి. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. పూజల అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కొవ్వూరు గ్రామ పెద్దలు, గ్రామస్తులు

'వారాహి అమ్మవారి ఆలయాన్ని పరిరక్షించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో ఉన్న వారాహి అమ్మవారి ఆలయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధీనంలోనే ఉంచి పరిరక్షించాలని ఆ గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు జనసేన కాకినాడ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు కరెడ్ల గోవిందు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్ వద్దకు వచ్చి ఏవో రామ్మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. గోవిందు మాట్లాడుతూ వారాహి అమ్మవారి ఆలయాన్ని దేవదాయ శాఖ అధీనంలో ఉంచాలని, ఆలయానికి వచ్చిన ఆదాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ ఆలయాన్ని 19 నెలలుగా ఒకే వ్యక్తి నిర్వహిస్తున్నాడన్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన దీనిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెండెం అప్పారావు, ఎం.వెంకట్రావు, డి.శ్రీనివాస్, పి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీరు

గొల్లప్రోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారు కొత్త కాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీకి వెళ్లే రహదారులన్నీ సుద్దగడ్డ వరద ముంపులో చిక్కుకోవడంతో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో తాగునీటి సరఫరాపై కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. దీంతో కలెక్టర్ స్పందించి కాకినాడ ఆర్డీవో మల్లిబాబును దగ్గరుండి పరిస్థితిని పర్యవేక్షించమని ఆదేశాలు ఇచ్చారు. సోమవారం 12 గంటల పాటు శ్రమించి తాటిపర్తి రోడ్డు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాత్రి 10గంటల సమయంలో ట్యాంకర్లను పంపించగలిగారు. మంగళవారం ఉదయం నుంచి రెండు ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఆర్డీవో పాటు గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరు నామ కనకారావు తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు.

'ఎంఎస్‌ఎంఈ పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ విడుదల చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా కార్లు, వాహనాలు తీసుకున్న ఎస్సీ లబ్ధిదారులకు సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేయాలని ఆంధ్ర మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. డీబీఎఫ్ ప్రతినిధి చెంగల్‌రావు, ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ ద్వారా కార్లు, వాహనాలు కొనుగోలు చేసిన ఎస్సీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సబ్సిడీ సొమ్ములు సకాలంలో విడుదల కాక కొంతమంది అప్పుల పాలయ్యారని వాపోయారు. కొంతమంది వాహనాలను బ్యాంకర్లు బలవంతంగా స్వాధీనం చేసుకోవడంతో ఉపాధి కోల్పోయారన్నారు.

'పట్టు సాగులో కుటుంబ సభ్యుల పాత్ర కీలకం'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టు సాగు కుటీర పరిశ్రమ లాంటిదని, దీనిలో కుటుంబసభ్యుల పాత్ర కీలకమని సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. చేబ్రోలులో మహిళా రైతులకు పట్టు పురుగుల పెంపకంపై మంగళవారం అవగాహన కల్పించారు. పట్టుగూళ్లు కట్టకపోవడానికి గల కారణాలు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులను వివరించారు. అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని మాస కల్యాణం

పిఠాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కల్యాణ సంతాన గోపాలస్వామిగా ప్రసిద్ధిగాంచిన పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి శ్రావణ మాస కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. యాగ్నిక బ్రహ్మ సుదర్శన మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో లగ్నాష్టక చూర్ణిక తదితర వేద మంత్రాలతో కల్యాణక్రతువు జరిపించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలను అందజేశారు. ఈవో నున్న శ్రీరాములు, అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు, ఫైండా రమాభాస్కరరావు, సత్యనారాయణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

కోలాటం కళాకారులకు చేయూత

కరప, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలయ్యతోట రామాలయంలో కోలాటం నేర్చుకుంటున్న మహిళలకు ఎంపీ సానా సతీష్‌బాబు ఫౌండేషన్ రూ.17వేలు అందజేసింది. కోలాటానికి అవసరమైన దుస్తులు, ఇతర వస్తు సామగ్రికి ఈ నిధులను వినియోగించాలని ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మణమూర్తి, చింతపల్లి అర్జున్ సూచించారు. టీడీపీ కరప మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకన్న కోరిక మేరకు సానా సతీష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ మొత్తాన్ని అందజేసినట్టు వారు చెప్పారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కోన వెంకటలక్ష్మి, దేవు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'బాలికల హక్కులకు భంగం కలిగితే చర్యలు'

పిఠాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులకు భంగం కలిగితే వెంటనే బాలలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ దుర్గారాణి తెలిపారు. ఎఫ్‌కేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బేటీ బచావో-బేటీ పడావో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం నరసింహమూర్తి, ఉపాధ్యాయులు అరుణకుమారి, రామకృష్ణ, అంగన్వాడీ కార్యకర్త బి.రాణి పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్ పుట్టినరోజు వేడుక

కాకినాడ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 93 బీసీ కులాల ఐక్యవేదిక (మన పార్టీ) వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్సీ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ రైతుబజార్ పక్కన గల రాష్ట్ర కార్యాలయంలో జరిపారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా కిషోర్, రజక సాధికార సమితి డైరెక్టర్ ఏడీడీ మెంటారావు, పద్మశాలీ సంఘం నాయకులు మనకంటి సత్యనారాయణ, ఆవుపాటి ఉమాశంకర్, అంగులూరి ధర్మారావు, బీసీ యువత నాయకులు మాకిరెడ్డి సూర్యతేజ, కేత దివాకన్, కొప్పిశెట్టి మహేష్, నున్న సాత్విక్, తలారీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో వరలక్ష్మి వ్రతాలకు ఏర్పాట్లు



పాదగయ ఆవరణలో క్యూలైన్ల నిర్మాణం

పిఠాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాల కోసం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించారు. వ్రతాల్లో పాల్గొనే వారి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 10వేల చీరలు సమకూరుస్తున్నారు. పది వేల మంది మహిళలు వస్తారనే అంచనాలతో అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందుకోసం పాదగయ క్షేత్రం బయట క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఐరన్ బారికేడ్ల ఏర్పాటు ద్వారా భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని భావించి ఇప్పటికే పనులు మొదలెట్టారు. పాదగయ ఆవరణలో ఒకేసారి రెండు వేల మంది భక్తులు కూర్చునే అవకాశం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. దీంతో పదివేల మందికి టిక్కెట్లు జారీ చేస్తారా లేక సంఖ్య తగ్గిస్తారా అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్ క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు.



మంత్రి సుభాష్‌కి బొకే ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నానాజీ

నానాజీని కలిసిన మంత్రి సుభాష్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం గొడారిగుంటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసిన మంత్రికి నానాజీ బొకే ఇచ్చి స్వాగతం పలికి ఆత్మీయ సత్కారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు, అభివృద్ధికి నిధుల మంజూరుపై మంత్రితో నానాజీ చర్చించారు.

నూతన భవనాలు ప్రారంభం



అటవీ శాఖ పర్యవేక్షణలో నిర్మించిన షాపులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

తాళ్లరేవు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ పర్యవేక్షణలో ఈడీసీ కమిటీల ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో మట్లపాలెంలో రెండు షాపులు, పెదవలసలలో పీతల షెల్టరు నిర్మించారు. మంగళవారం వీటిని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. రేంజర్ ఆఫీసర్ వరప్రసాదరావు, సర్పంచ్‌లు పినపోతు కామేశ్వరరావు, కామాడి గోవలక్ష్మి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, దూళిపూడి వెంకటరమణ, కొత్తూరి కాశీశ్వరుడు, ఈడీసీ చైర్మన్లు చెక్కా నూకరాజు, బొడ్డు గంగాధరరావు, కూటమి నాయకులు, ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పిఠాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చిత్రాడకు చెందిన కాశీ రత్నకుమారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.68,147 మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమెకు చెక్కు రూపంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అందజేశారు. లారీ ప్రమాదంలో గాయపడ్డ బత్తిన సుబ్రహ్మణ్యాన్ని ఆయన పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

'పారిశుధ్యంపై దృష్టి సారించాలి'



తడి-పొడి చెత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అనుపమ

కరప, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోగాలు దరిచేరకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. మంగళవారం ఉదయం ఆమె స్థానిక వీధుల్లో పర్యటించి ఇంటింటికీ చెత్త సేకరణను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పాతర్లగడ్డలో డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు పర్యటించి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యదర్శి యు.నిర్మలాదేవి, శివరామ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గండి పూడ్చివేతకు తక్షణ చర్యలు: కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి సంపర పేరయ్య చెరువుకు పడిన గండిని తక్షణం పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు ఔట్‌లెట్, ఇన్‌లెట్ వద్ద గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోవడంతో తాటిపర్తి ఎస్సీ కాలనీలోని వీధులు ముంపనకు గురయ్యాయి. దీంతో గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్ ఆధ్వర్యంలో గుర్రపుడెక్కను తొలగించడంతో ముంపు బెడద తప్పింది.

ఆర్డీవో మల్లిబాబు ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు చేరుకుని ఇసుక బస్తాలతో గండి పూడ్చే చర్యలు చేపట్టారు. గొల్లప్రోలు తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, ఆర్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

'పారదర్శకంగా కోర్టు ఉద్యోగాల పరీక్షలు'

పిఠాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో ఉద్యోగాల భర్తీకి బుధవారం నుంచి మూడు రోజులు పాటు ఆన్‌లైన్‌లో పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తెలిపారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం కేంద్రాలుగా ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మెరిట్ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.



ఇంటర్ విద్యార్థినులకు క్విజ్ పోటీలు

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువతలో హెచ్‌ఐవీ/ ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లు (ఎస్‌టీఐ), మాదకద్రవ్యాల వినియోగంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా ప్రోగ్రాం మేనేజరు పి.బాలాజీ, జిల్లా మానటరింగ్-డాటా ఆఫీసర్ ఎంవీ రత్నంరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న డొక్కా సీతమ్మ కాంటీన్‌లో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో 500మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, బుదిరెడ్డి శ్రీనివాస్, పాలెం బాబీ, అంకం ఓం కృష్ణ, తుమ్మల మనోజ్, గంధం శ్రీను, డ్రిల్ మాస్టారు, అడబాల వీరబాబు, రేవూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెట్టినట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మొదటి రోజు మండల స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయనతో పాటు సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్, డీఎఫ్‌వో రవీంద్ర ధామ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భం గా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఆదికర్మయోగి కార్యక్రమం ద్వారా 2047 నాటికి మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి, అదేవిధంగా తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు కల్పించేలా గ్రామ విజన్ మ్యాప్ సిద్ధం చేస్తామన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లోని ముఖ్య సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఆదికర్మయోగి కార్యక్రమం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు జి.శారదాదేవి, చంద్రకిరణ్, శిరీష, రామం, అచ్యుత్ కిరణ్, ధ్రువకుమార్, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీని వాసరావు, ఏడు మండలాల ఎంపీడీవోలు, విద్యాశాఖా ధికారులు, ఏటీడబ్ల్యువోలు, వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సీడీపీవోలు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



అధ్వానంగా ఉన్న ఇందుకూరు రోడ్డు

దేవీపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇందుకూరు నుంచి బియ్యంపల్లి, లోతుపాలెం, కొత్తవీధి, మునినిగుంట, వెలగపల్లి నుంచి డొల్లంక, చొప్పకొండ, గుటకరాయి, కమలంపాలెం, శరభవరం, దేవారం తదితర గ్రామాల్లో రోడ్లు గుంతలుగా మారి రాళ్లు పైకిలేచిపోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే చాలా అవస్థలు పడుతున్నామని ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని స్థానిక గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్వాసిత భూముల్లో వేసిన జెండాలను తొలగించాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన అఖిలపక్షం నాయకులు



తహశీల్దార్‌కు వినలిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

వీఆర్‌పురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) నిర్వాసిత గిరిజనేతర భూముల్లో గిరిజన సంఘం (సీపీఎం) ఆధ్వర్యంలో పెట్టిన జెండాలను తొలగించి, ఆక్రమణలను అరికట్టాలని మంగళవారం టీడీపీ, జనసేన, వైసీపీ, బీజేపీ పార్టీల (అఖిలపక్షం) ఆధ్వర్యంలో తహశీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిర్వాసిత గిరిజనేతరులు నష్టపరిహారం పొందిన భూముల్లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెట్టిన జెండాలను వెంటనే తొలగించాలని, ఆక్రమణలకు పాల్పటిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, గిరిజనేతరులకు రక్షణ కల్పిం చాలని వారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాయం వెంకయ్య, వైసీపీ జిల్లా నాయకులు చిక్కాల బాలకృష్ణ, బొడ్డు సత్యనారాయణ, చీమల కాంతారావు, టీడీపీ నాయకులు ముత్యాల రామారావు, గొంది చంద్ర య్య, ముత్యాల సిద్దార్థ, ముత్యాల చంద్రశేఖర్, చక్రపాణి, జనసేన నాయకులు బాగుల అంజన్‌రావు, బాగుల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో భారీ అవకతవకలు

- కోట్ల రూపాయల పనుల్లో తేడాలు..
- ఆరుగురు సస్పెన్షన్, రసాభాసగా ప్రజావేదిక



అధికారులను ప్రశ్నిస్తున్న నేతలు

రాజవొమ్మంగి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పనులలో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఉపాధి హామీ సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజావేదికను అధికారులు నిర్వహించారు. సమావేశంలో ఆడిట్ సిబ్బంది పది రోజులుగా గ్రామాల్లో తిరిగి గుర్తించిన కోట్ల రూపాయల అవకతవకలను డ్వామా పీడీ విద్యాసాగర్‌కు నివేదించారు. పీడీ వేతనదారులు, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లడి చాలా పనులను తిరిగి చేయాలని ఆదేశించారు. మండలంలో ఒకే కుటుంబంలో రెండు, మూడు జాబ్‌కార్డులు ఉన్నట్లు గుర్తించామని, చాలా గ్రామాల్లో ఉద్యోగస్తులకు కూడా జాబ్ కార్డులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అనేక గ్రామాల్లో ఉపాధి పనులు జేసీబీలు ఉపయోగించి పనులు చేసినట్లు గుర్తించామన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా రాజవొమ్మంగి మండలంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. సుమారు ఆరు లక్షల రూపాయల రికవరీ కట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించామన్నారు. తప్పులుగా పలు గ్రామాల్లో పనులను గుర్తించి ఆరుగురిని సస్పెండ్ చేశామన్నారు. వారిలో ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక ఈసీ ఉన్నారన్నారు.

రసభసగా: గిరిజన గ్రామాల్లో వేరే పనులు చేసుకునేందుకు ఆధారం లేక ఉపాధి పనిపై ఆధారపడి గిరిజనులు జీవనం సాగిస్తారని, అటువంటి వారి నుంచి అధిక మొత్తంలో రికవరిలు, చిన్న చిన్న ఉద్యోగుల సస్పెండ్‌లు సరికాదని ఆదివాసీ నాయకులు వంతు బాలకృష్ణ, గిరిజన సంఘం నాయకులు కుంజం జగన్నాధం, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధికారులను ప్రశ్నించారు. దీంతో రెండు గంటలు సభ ప్రాంగణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీఐ గౌరీశంకర్, ఎస్ఐ నరసింహమూర్తిలు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించండి

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 16వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. మంగళవారం స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో 16వ నెంబర్ జాతీయ రహదారి గండేపల్లి మండలం మురారి నుంచి కిర్లంపూడి మండలం సోమవారం వరకు విస్తరించి ఉందని, 30వేల ప్రమాదాలు 5 వేలకు పైగా ప్రజలు చనిపోయారన్నారు. 2003లో 4 లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో గండేపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఒక వ్యక్తి నిలుపుదల చేయడంతో అదే వ్యక్తి కుటుంబంలో అదేచోట 11మంది రోడ్డు ప్రమాదంలో మరణించారని అన్నారు. ముఖ్యంగా జేవీఆర్ సెంటర్లో రోజు ప్రమాదాల బారినపడి అనేకమంది చనిపోతున్నార న్నారు. జేవీఆర్ సెంటర్ దాటిన తర్వా త వేబ్రిడ్జి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి త్వరితగతిన పూర్తిచేసి ప్రమాదాలు నివారించేందుకు నేషనల్ హైవే అథారిటీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జగ్గంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఉన్న సర్వీస్ అప్రోచ్ రోడ్లు డబుల్ రోడ్లుగా విస్తరించి ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. ఈవిషయంపై నేషనల్ హైవే అథారిటీ వారు తక్షణం స్పందించాలన్నారు. అదేవిధంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, కుంచే తాతాజీ, బద్ది సురేష్, పిలా మహేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నెహ్రూకు వినతిపత్రం ఇచ్చిన ఆటో డ్రైవర్లు



ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

సమస్యలను పరిష్కరించాలని ఆటో కార్మికుల నిరసన

ఎమ్మెల్యేకు వినతిపత్రం

జగ్గంపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకంతో తాము జీవనో పాధి లేక నష్టపోతున్నామని, తమ సమస్య లను పరిష్క రించాలని ఆటో కార్మికులు మంగళవారం జగ్గం పేటలో నిరసన ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మాన వహారం చేపట్టి న్యాయం చేయా లంటూ నినాదాలు చేశారు. తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆటో కార్మికుల యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు రూ.1500 ఇస్తామన్న పథ కాన్ని మొదటగా ఆటో డ్రైవర్ల భార్య లకు అమలు చేయాలని, తమకి న్యాయం చేయాలని కోరారు. అక్కడ నుంచి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వద్దకు చేరుకుని సమస్యలను వివరించారు.

ఏలేశ్వరం,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు న్యాయం చేయాలంటూ ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. మంగళవారం ఆటో యూనియన్ వర్కర్స్ నేతృత్వంలో ఏలేశ్వరం మెయిన్ రోడ్డు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉచిత బస్సు పథకం ద్వారా తాము నష్టపోయామని, న్యాయం చేకూర్చాలని ఆటో డ్రైవర్లు తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

తునిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ముందుకు సాగాలని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు 2004 నుంచి ఇప్పటి వరకు 2300యూనిట్ల రక్తాన్ని ఇచ్చి సేవా నిరతి చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో మదర్ బ్లడ్‌బ్యాంక్ ప్రెసిడెంట్ జీఎల్ఎల్ కిరణ్, రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హెచ్ఆర్ డాక్టర్ వివిఎస్‌బి బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రోటరాక్ట్ యంగ్ లీడర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బాలికల హక్కులకు భంగం కలిగితే చర్యలు'

పిఠాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులకు భంగం కలిగితే వెంటనే బాలలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్‌లో సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ దుర్గారాణి తెలిపారు. ఎఫ్‌కేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బేటీ బచావో-బేటీ పడావో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూములపై వలసదారుల పెత్తనం



పొదురుపాకలో ప్రదర్శన దృశ్యం

ప్రత్తిపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సబ్ ప్లాన్ ఏజెన్సీలోని ఆదివాసీల భూములపై వలస భూస్వాముల పెత్తనం ఎక్కువైందని సీపీఎం లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారు రాజు విమర్శించారు. పొదురుపాకలో మంగళవారం ఆదివాసీ సంఘ కార్యకర్తల ప్రదర్శన నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో మైనింగ్ లీజులు వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏగుపాటి అర్జున రావు డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులను గిరిజనులుగా గుర్తించి షెడ్యూల్ ఏరియాగా ఈప్రాంతాన్ని గుర్తించి పెదమల్లాపురం కేం ద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆదివాసీ సంఘం అధ్యక్షుడు చేరుకట్ల సింహాచలం డిమాండ్ చేశారు. సమావేశంలో లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, ఇరటా కృష్ణ, కస్తూరి శేషమ్మ, అడ్డాల విజయ్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రూ.250కోట్ల రుణాల లక్ష్యం

ప్రత్తిపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డ్వాక్రా సంఘాలకు స్త్రీనిధి బ్యాంక్ ద్వారా రూ.250కోట్లు రుణాలు మంజూరుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు చెప్పారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం చిన్న తరహా పరిశ్రమదారుల ధ్రువపత్రాల మంజూరు, ఆధార్ శిబిరాన్ని పీడీ ప్రారంభించారు. డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 38వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా రూ.250కోట్లు రుణాలు లక్ష్యం కాగా ఇప్పటికీ రూ.40 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. రాబోయే మార్చి నెలాఖరులోగా మిగిలిన రుణాలు డ్వాక్రా సంఘాలకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2.70లక్షల మంది పింఛనుదారులు ఉండగా వారికి ప్రతినెలా రూ.116కోట్లు పింఛన్లగా చెల్లిస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలు, చిరువ్యాపారుల కోసం ప్రభుత్వం క ల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం పరుచుకుని ఆదాయ మార్గాలు పెంపొందించుకోవాలని పీడీ కోరారు. సమావేశంలో ఏపీఎం గిడిజాల శ్రీనివాసరావు, డీపీఎం కేశవ, రాయ్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిట్టూరి లోవకుమారి, పరిశ్రమల శాఖ ప్రమోషన్ అధికారి సందీప్, వెలుగు సీసీలు వై.వెంకట్ శ్రీనివాస్, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్తిపాడు డీఆర్‌డీఏ పీడీ

వీఆర్వోకు సత్కారం



ఏలేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ అవార్డు గ్రహీత వీఆర్వో అవసరాల కిషోర్‌ను స్థానిక కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. మంగళవారం శిడగం వెంకటేశ్వరరావు నేతృత్వంలో కిషోర్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కౌన్సిలర్లు బదిరెడ్డి గోవింద్, ఢోకే కిషోర్, మాజీ కౌన్సిలర్లు సామంతుల సూర్య కుమార్, సుంకర రాంబాబు, పైల విజయ్ కుమార్, దేగల చంద్రమౌళి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కోటనందూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17పంచాయతీల్లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని కోటనందూరు పీహెచ్‌సీ డాక్టర్ యామిని కావ్య అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాధపురం కోనేరులో మాజీ ఎంపీపీ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ యర్ర చిన్నసత్యనారాయణ ఆధ్వర్యంలో గంభూషియా చేప పిల్లలు వేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది విజయ్, రమేష్, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

మహాసభకు తరలిరండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 30న నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలో స్థానిక లచ్చారావు కాలనీలో సభ నిర్వహించారు. సంచార జాతుల ప్రజలందరూ మహాసభకు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కరపత్రం ఆవిష్కరించారు. బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతుల అవగాహన సభలో మాట్లాడుతున్న ఏవో గాంధీ

ఎరువుల వాడకంపై అవగాహన

శంఖవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సిఫార్సు మోతాదులోనే పంటలకు ఎరువుల వాడకం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా నెల్లిపూడి, కొంతంగి గ్రామాల్లో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, రాయితీపై పామాయిల్ మొక్కలు, పంట నమోదు, కౌలుకార్డుల అవశ్యకత తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మణికంఠ, రాజు, రామలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో కుట్టుశిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్‌బాబు

కుట్టుశిక్షణ పరికరాలు అందజేయాలి

ప్రత్తిపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుట్టుశిక్షణ పరికరాలు అందజేయాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబును పలువురు మహిళలు కోరారు. స్థానిక హైస్కూల్ సమీపంలో జీవనోపాదుల శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న మహిళల అవసరాలపై ఆరా తీశారు. ప్రధానంగా కత్తెర్లు వంటి పరికరాలు లేక ఇబ్బందులుపడుతున్న పలువురు మహిళలు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఉలిగోగుల రహదారికి నిధులు మంజూరు

మండలంలోని బురదకోట పంచాయతీ పరిధిలో ఎత్తైన కొండపై ఉన్న ఉలిగోగుల రహదారికి రూ.1.80 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ గ్రాంట్ రూ.1.80 కోట్లతో ఉలిగోగుల నుంచి మెట్టిచింత వరకు 3.5 కిలోమీటర్ల రహదారి నిర్మిస్తామని తెలిపారు. ఉలిగోగుల గిరిజనుల కోరిక మేరకు భద్రవరంలో పనిచేస్తున్న ఏఎన్ఎం సత్యవతిని తిరిగి ఉలిగోగులలో పని చేసేలా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నివేదిక పంపామని ఆయన తెలిపారు.

భారీ వర్షాలతో చెరువులకు జలకళ



ప్రతిపాడు మండలం రాచపల్లి వద్ద నీట మునిగిన వరి పొలాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తాగునీటి చెరువులు, ఇరిగేషన్ ప్రాజెక్టులు జలకళతో కళకళలాడుతున్నాయి. సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టు లోకి వరద జలాలు పెద్ద ఎత్తున రావడంతో ఈ ప్రాజెక్టులో నీటిమట్టం బాగా పెరిగింది. సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ వద్ద 80 మీటర్ల స్థాయికి నీటిమట్టం చేరుకుంది. దీంతో గోకవరం వీఆర్వో దేవుడు, ఇరిగేషన్ సిబ్బంది ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. ఒమ్మంగిలోని గోపాలుడి చెరువు నిండుకుండలా మారి అదనపు జలాలు బయటకు వస్తున్నాయి. ఏలూరు వెంకటపతిరాజు చెరువు, పెదశంకర్లపూడి వెంకన్నదొర చెరువు, ధర్మవరం రామభద్రరావు చెరువు, ఒమ్మంగి రాజు చెరువు, చింతలూరు రామానుజం చెరువు, ప్రత్తిపాడు పుత్ర చెరువు, రాచపల్లి కొత్త చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి.

ముంపునీటిలో పంట పొలాలు: మండలంలోని పంట పొలాలు ముంపు నీటిలో ఉండటంతో రైతులు కలవరపడుతున్నారు. రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి, ఏలూరు తదితర గ్రామాల్లో వరి పొలాలు మోకాలిలోతు నీటిలో ఉన్నాయి. అల్పపీడనం వల్ల రెండు, మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు కలవర పడుతున్నారు. మండల వ్యవసాయ అధికారి జోకా అమృత ముంపుబారిన పంటలను పరిశీ లించి రైతులకు పలు సూచనలు చేశారు.



తొండంగిలో నీట మునిగిన ఆవ వరి పొలాలు

ముంపులో ఏకొత్తపల్లి వరి పొలాలు

తొండంగి, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఏ.కొత్తపల్లి గ్రామంలోని ఆవలో ఉన్న వరిపొలాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో ఆ ప్రాంతం చెరువును తలపిస్తున్నది. కొమ్మనాపల్లి, రావికంపాడు, ఏవీ నగరం, కోదాడ తదిత గ్రామాల్లోని ఆయా పల్లపు ప్రాంత వరిపొలాలు నీట మునిగాయి. మంగళవారం నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్ పి.అగ్రహారం గ్రామంలో పర్యటించారు. తిమ్మాపురం, పీ.అగ్రహారం గ్రామాల మధ్య పంపా కాల్వకు తిమ్మాపురం దగ్గరలో గండిపడిన నేపథ్యంలో ఆయన గ్రామంలో నేతలు, అధికారులతో సమావేశమయ్యారు. రెండు మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో గండి పూడ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సాయి నవీన్, తహశీల్దార్ టి.కాంతారావు, ఆర్ఐ రాజారావు ఉన్నారు.

ముంపు పొలాల పరిశీలన

తునిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.తిమ్మాపురం, తొండంగి మండలం పి.అగ్రహారం మధ్యలో పంపా కాల్వకు గండి పడడంతో పొలాల్లోకి భారీగా నీరు చేరింది. ఇది తెలుసుకున్న జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. తుని నియోజకవర్గ ప్రత్యేకాదికారి ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో మండల అధికారులు ముంపు పొలాలను పరిశీలించారు. నష్ట నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తుని రూరల్‌లో పలువురు రైతులతో మాట్లాడుతున్న అధికారులు



సతీష్‌ను సన్మానిస్తున్న కూటమి నేతలు

జనసేన నేతకు సన్మానం

రౌతులపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి సత్రం మెంబర్‌గా ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన జనసేన నేత పక్కుర్తి సతీష్ నియమితులయ్యారు. ఆయన్ను కూటమి నేతలు గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు, గండేపల్లి శివ, కూరగాయల గంగాధర్, త్రిమూర్తులు గొంపా సత్తిబాబు, మేకల సంజయ్, మోతుకూరి సతీస్ తదితరులు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

'ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించండి'

జగ్గంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని జగ్గంపేట ప్రాజెక్టు అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. జగ్గంపేట నెహ్రూ కాలనీలో యూటీఎఫ్ హోమ్‌లో జగ్గంపేట ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మహాసభ కే.రత్నం అధ్యక్షతన జరిగినది. ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ చంద్రావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఈ నెల 21న బ్లాక్ డేలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలిగా కె.రత్నం, కార్యదర్శిగా బి.సుజాత, కోశాధికారిగా వై.వి రాజేశ్వరి, గౌరవా ధ్యక్షురాలిగా ఈ.చంద్రావతి. ఉపాధ్యక్షులు ఆర్.శ్యామల, ఆనంతలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఎం.సుభారత్నం, పి.లీల, కెరత్నం, దేవి.జ్యోతి, నాగమణి, అమ్మాజీ, గంగాభావని ఎన్నికయ్యారు.



అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం